క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిరిసిల్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ×సెస్॥ అధికారులు గురువారం తెలిపారు. సిరిసిల్ల అంబికానగర్, టెలిఫోన్ ఫీడర్ 11 కేవీ లైన్‌మెంటనెన్స్ కారణంగా శుక్రవారం ఉదయం7 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అంబికానగర్, అశోక్‌నగర్, పద్మనగర్, సర్దార్‌నగర్, వెంకంపేట, సాయినగర్, ఇందిరానగర్, గోపాల్‌నగర్, గణేశ్‌నగర్, బీ.వై.నగర్, తారకరామానగర్, శివనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని 'సెస్' అధికారులు కోరారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగంపల్లి, అక్కపల్లి, దుమాల, రాచర్లతిమ్మాపూర్, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ పృథ్వీధర్‌గౌడ్ గురువారం తెలిపారు. ఆయా గ్రామాల్లోని విద్యుత్ తీగల కింద పెరిగిన చెట్లను కొట్టి వేస్తున్నందున ఉదయం 7.30 గంటల నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే డిగ్రీ కళాశాలలో ఇంటర్ పూర్తయిన విద్యార్థులు ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కుక్కిల్ల వీర ప్రభాకర్ కోరారు. ఈ సదర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. 2024– 2025లో ఇంటర్ పూర్తయిన వెనుకబడిన బీసీ విద్యార్థులు 2025–2026 డిగ్రీ విద్యాసంవత్సరానికి వెంటనే గడువులోపు పూర్తి వివరాలు, సర్టిఫికెట్లతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మే 5 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



వేములవాడ: తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వేములవాడ మున్సిపాలిటీ ముందు చలివేంద్రాన్ని గురువారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ నజీర్ అహ్మద్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగుమంటి ఎల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు గుర్రం అశోక్, మల్లారం ప్రశాంత్, సీపీఎం నాయకులు ముక్తికాంత అశోక్, ఏఐటీయూసీ నాయకులు కదారి రాములు, కార్మికులు పాల్గొన్నారు.

రాజీవ్ యువవికాసం దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

తంగళ్లపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువవికాసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ఈనెల 14తో ముగియగా గురువారం తంగళ్లపల్లి ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తుదారుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రారంభమైంది. మొదటి రోజు పద్మనగర్, తంగళ్లపల్లి గ్రామాల 220 మంది దరఖాస్తుదారుల ధ్రువీకరణ పత్రాలను అధికారులు పరిశీలించారు. తంగళ్లపల్లి నుంచి సుమారు 600 పైగా దరఖాస్తులు రాగా శనివారం పరిశీలిస్తామని ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈనెల 21న అంకుషాపూర్, గోపాలరావుపల్లె, లక్ష్మిపూర్, పాపయ్యపల్లె, తాడూర్, వేణుగోపాలపూర్, 22న ఇందిరానగర్, మల్లాపూర్, జిల్లెల్ల, 23, 24 తేదీల్లో మండెపల్లి, ఇందిరమ్మకాలనీ, రాళ్లపేట, గండిలచ్చపేట, కస్బేకట్కూర్, 25న బద్దెనపల్లి, రామన్నపల్లి, బాలమల్లుపల్లె, బస్వాపూర్, 26న ఓబులాపూర్, అంకిరెడ్డిపల్లె, రామచంద్రాపూర్, 28న చీర్లవంచ, చింతలఠాన, నర్సింహులపల్లె, చిన్నలింగాపూర్, నేరెళ్ల, 29న దేశాయిపల్లె, సారంపల్లి గ్రామాలవారీగా ధ్రువీకరణ పత్రాలు పరిశీలించనున్నారు. ఎస్‌బీఐ జిల్లెల్ల బ్రాంచ్ మేనేజర్ రంజిత్ రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు

చందుర్తి: రాజీవ్ యువవికాసం పథకం కోసం దరఖాస్తులు చేసుకున్న మర్రిగడ్డ గ్రామానికి చెందిన 109 మందిని మండల ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలపరిషత్ కార్యాలయంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మర్రిగడ్డకు చెందిన 120 మంది ఈ పథకానికి దరఖాస్తులు చేసుకోగా ఇంటర్వ్యూలకు 109 మంది హాజరైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో బండి ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఐకేపీ ఏపీఎం రజిత, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: రాజీవ్ యువ వికాస పథకం కింద వివిధ యూనిట్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 19 నుంచి 23 వరకు మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

అలంకారప్రాయంగా..



గంభీరావుపేట: మండల కేంద్రంలోని బరిగెలగూడెంలో బోరుబావి, మినీ వాటర్ ట్యాంక్‌లు అలంకారప్రాయంగా మారాయి. వీటిని వినియోగంలోకి తేవడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా కాలనీవాసులు తాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఎప్పుడు కూలుతుందో.!



బోయినపల్లి: మండలకేంద్రం నుంచి గంగాధర వెళ్లే రోడ్డులో రోడ్డు పక్కకు ఎండిపోయిన భారీ వృక్షం ప్రమాదకరంగా మారింది. దీంతో ఎప్పుడు కూలి ప్రమాదం జరుగుతుందోనని, ప్రమాదం జరగకుముందే చెట్టును తొలగించాలని పలువురు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



గంభీరావుపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ విజయ



కోనరావుపేట: సుద్దాలలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్లు ఎల్లయ్య, రాంమోహన్

గంభీరావుపేట: రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఏఎంసీ చైర్‌పర్సన్ కొమిరిశెట్టి విజయ అన్నారు. గురువారం మండలంలోని మల్లుపల్లి, నాగంపేట, దమ్మన్నపేట, జగదాంబ తండా, గంభీరావుపేట, నర్మాల, దేశాయిపేట, శ్రీగాధ, రాజుపేట, కొత్తపల్లి, లింగన్నపేట, మల్లారెడ్డిపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శహన్మండ్లు, ఐకేపీ ఏపీఎం సుదర్శన్, తహసీల్దార్ మారుతిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, డైరెక్టర్లు, స్పందన మండల సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, సీఏలు మమత, సంతోష, సంధ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. సుద్దాల, పల్లిమక్త, ఎగ్లాస్‌పూర్‌లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్లు సంకినేని రాంమోహన్‌రావు, బండ నర్సయ్య, వైస్ చైర్మన్లు అనుపాటి భూంరెడ్డి, కాశవేని మహేశ్, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రభాకర్, డైరెక్టర్లు, పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని దుండ్రపల్లి, కోరెం, మల్కాపూర్, తడగొండ, రత్నంపేట, దేశాయిపల్లి, మాన్వాడ, మల్లాపూర్ గ్రామాల్లో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కాలె నారాయణరెడ్డి, ఐకేపీ ఏపీఎం జయసుధ, మార్కెట్ కమిటీ పాలకవర్గం, మండల కాంగ్రెస్, యువజనకాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పలుగ్రామాల నుంచి ధాన్యం కొనుగోలు చేసి గోదాంకు తరలించారు. పొత్తూరు, పెద్దలింగాపూర్, రహీంఖాన్‌పేట వెల్జీపూర్, తదితర గ్రామాల నుంచి ధాన్యం కొనుగోలు చేసి గోదాంకు తరలించినట్లు ఆయాకేంద్రాల కమ్యూనిటీ కోఆర్డినేటర్లు ఒల్లాల వెంకటేశం, రాజేశ్వరి, రామ్ చంద్రారెడ్డి, సదయ్య తెలిపారు.

పథకాన్ని నీరు కార్చొద్దు

సిరిసిల్లటౌన్: దేశంలోనే ఆదర్శంగా సిరిసిల్లలో అమలవుతున్న రూ.101లకు అంతిమ సంస్కారాల పథకాన్ని నీరు గార్చొద్దని పట్టణ పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ కోరారు. గురువారం సమితి ప్రతినిధులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ ద్వారా నిర్వహిస్తున్న దహన సంస్కారాల పథకానికి నిధుల కొరత ఏర్పడిందని తద్వారా పథకం నిలిచిపోతుందన్న ప్రచారంపై కలెక్టర్ వెంటనే స్పందించాలని కోరారు. ఒక వేళ నిధుల కొరత ఏర్పడితే సీఎం నుంచి తగిన నిధులు తెచ్చుకోవాలని, అవసరమైతే దాతలనుంచి నిధులు సమకూర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో వేముల పోశెట్టి దేవలపల్లి శ్రీరాములు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సభను విజయవంతం చేయాలి



వేములవాడ: బీఆర్‌ఎస్ బహిరంగసభ విజయవంతం చేయాలని ఆపార్టీ నియోజకవర్గ నేత లక్ష్మీనరసింహారావు గురువారం ప్రచారం నిర్వహించారు. గోడలపై పార్టీకి మద్దతుగా వాల్ రైటింగ్ చేయడం విశేషం. వాల్ రైటింగ్ అనంతరం పురవీధుల్లో బైక్ పై తిరుగుతూ యువతలో జోష్ నింపే విధంగా నినాదాలుచేస్తూ, పార్టీ కార్యక్రమాలను వివరించారు

నూతన కార్యవర్గం



వేణుకుమార్

రుద్రంగి: రుద్రంగి జెడ్పీ హైస్కూల్‌లో గురువారం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) మండలశాఖ సమావేశం నిర్వహించారు. అనంతరం డీటీఎఫ్ మండలశాఖ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడప వేణుకుమార్, ప్రధాన కార్యదర్శిగా కొప్పు శ్రీధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా డీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు బూర సదానందం, ఎన్నికల అధికారిగా జిల్లా ఉపాధ్యక్షుడు వంగ తిరుపతి, స్టేట్ కౌన్సిలర్లు అంబటి శంకర్, మంగళగిరి చక్రపాణి, చందుర్తి మండల అధ్యక్షుడు గుడిమల్ల సురేశ్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా కౌన్సిలర్లుగా కొండ్లేపు గోపి, ఉపాధ్యక్షుడిగా గద్దమీది రోహిత్, మన్నాల మాధవి, కార్యదర్శులుగా భూక్య తిరుపతి, అల్వాల జయశ్రీ, మామిడి తిరుపతి, ఆడిట్ కమిటీ చైర్మన్‌గా బొక్కెన వసంతయ్య, సభ్యులుగా శీలం మానస, షేక్ హైమద్‌ను ఎన్నుకున్నారు.

లబ్ధిదారుల ఎంపికపై సమావేశం

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపెల్లి, ఇల్లంతకుంట, రహీంఖాన్‌పేట, అనంతారం, తదితర గ్రామాల్లో గురువారం ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై సమావేశాలు నిర్వహించారు. సమావేశంలో ఆయా ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, కార్యదర్శులు, సమావేశంలో పాల్గొన్నారు. మండలానికి 813 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి.

బీఆర్‌ఎస్ నాయకులను అడ్డుకున్న పోలీసులు



వెంకటాపూర్ వద్ద బీఆర్‌ఎస్ నాయకులను అడ్డుకున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయగా, వారికి సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న మండల నాయకులను వెంకటాపూర్ వద్ద పోలీసులు గురువారం అడ్డుకున్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి సిరిసిల్ల వెళ్లి తిరిగి గంభీరావుపేటకు వెళ్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు అడ్డుకున్నారు. కొంతసేపటి తర్వాత వదిలేశారు. నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

తూకంలో అరకిలో పెంపుపై నిరసన

రైతుల నిరసన

చందుర్తి: ధాన్యం తూకంలో మరో అరకిలో ఎక్కువగా తూకం వేయాలని ఐకేపీ సెంటర్లలో మహిళా సంఘాల సభ్యులకు సూచనల వెనుక ఆంతర్యమేమిటని చందుర్తి రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలుక పెంటయ్య ఆధ్వర్యంలో రైతులు నిరసన తెలిపారు. రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ గత సీజన్‌లో బస్తాకు 41.600 కిలోల తూకం వేయగా ఇప్పుడు బస్తాకు 42 కిలోలు తూకం వేయాలని ఆదేశాలిచ్చారని ఆరోపించారు. రైతు సంఘం మండల ఉపాధ్యక్షుడు సంటి బాపురావు, రైతులు గాజుల సత్తయ్య, నాగరాజు, వట్టెంల కనకయ్య, దుద్యాల లచ్చిరెడ్డి, సుధాకర్, చింతం లక్ష్మీరాజం, ఎగుమామిడి కృష్ణారెడ్డి పాల్గొన్నారు

ఎస్‌ఎఫ్‌ఐ సభల పోస్టర్లు ఆవిష్కరణ

సిరిసిల్లటౌన్: ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఐదో మహాసభలను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుండెల్లి కల్యాణ్‌కుమార్, మల్లారపు ప్రశాంత్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలో రాష్ట్రమహాసభల వాల్‌పోస్టర్స్ జిల్లా కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈనెల 25, 26, 27 తేదీల్లో ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జూలపల్లి మనోజ్‌కుమార్, సామల్ల సాయి, భరత్, శివ, శ్రీధర్, రాబిన్‌సన్, సాయి, చరణ్, అక్షయ్, తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి

తంగళ్లపల్లి: లక్ష్మిపూర్‌లో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి గురువారం పర్యటించారు. తెలంగాణ సాయుధ పోరాట అమరుడు కామ్రేడ్ సింగిరెడ్డి భూపతి రెడ్డి కూతురు బద్దం సత్తవ్వ ఇటీవల మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులు అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, జిల్లా కార్యవర్గ సభ్యులు మంద సుదర్శన్, మీసం లక్ష్మణ్, కడారి రాములు, అజ్జ వేణు, సోమ నాగరాజు, మంత్రి చంద్రయ్య, ఎలిగేటి రాజశేఖర్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **అక్రమ కేసులు ఎత్తివేయాలి**

సిరిసిల్లటౌన్: పోడు భూముల పోరాటంలో పాల్గొన్న తమ నేతలపై అక్రమ కేసులు ఎత్తివేయాలని ప్రజాసంఘాల నాయకులు మల్లారపు అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణ కోర్టులో కేసులపై హాజరయ్యారు. స్థానిక బీవై నగర్‌లో అమృతలాల్ శుక్ల కార్మిక భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పోడు రైతుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. ప్రజాసంఘాల నాయకులు జాలపల్లి మనోజ్ కుమార్, కొమురయ్య, జింక పోషయ్య, గుర్రపు నరేశ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

● **నిధులు మంజూరు చేయండి**

బోయినపల్లి: మండలంలోని మల్లాపూర్ గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరుచేయాలని కోరుతూ సీనియర్ కాంగ్రెస్ నాయకులు వారాల నర్సింగం ఆధ్వర్యంలో గ్రామస్తులు గురువారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన మంత్రి మణెమ్మకు ఎమ్మెల్యే రూ.10 వేల ఆర్థికసాయంగా అందించారు.

● **ప్రాజెక్ట్ వర్క్‌పై వర్క్‌షాప్**

వేములవాడఅర్బన్: అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్‌తో కలిసి గురువారం పరిశోధన పద్ధతులు, ప్రాజెక్ట్ వర్క్‌పై వర్క్‌షాప్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు. పరిశోధన ద్వారా వివిధ సమస్యలకు పరిష్కారాలు కనుక్కోవడం విద్యార్థులు నేర్చుకోవాలన్నారు. అధ్యాపకులు లావణ్య, ప్రసాద్, నర్సయ్య తదితరులున్నారు.

● **మాతృభాష పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి**

ముస్తాబాద్: మాతృభాష పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలల తెలుగు అధ్యాపకుల సంఘం బాధ్యులు రాజు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటర్ విద్యలో సంస్కృత భాషను ప్రవేశపెట్టి, తెలుగును విస్మరించడం సరికాదన్నారు. ఇంగ్లిష్‌లో చదివితేనే ఉద్యోగాలు వస్తాయనే భ్రమలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారని, దీనికి కారణం ప్రభుత్వాలు కార్పొరేట్ కళాశాలలను ప్రోత్సహించడం వల్లేనని ఆయన పేర్కొన్నారు.

● **జాతీయస్థాయిలో కులగణన చేపట్టాలి**

కోనరావుపేట: బీసీలకు విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో జరుగుతున్న అన్యాయం, హక్కులపై పోరాటంచేయాలని జాతీయ బీసీ సంఘం మండల ప్రధాన కార్యదర్శి వీరబోయిన తిరుపతియాదవ్ అన్నారు. మండలకేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో బీసీబిల్లు పెట్టి, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, జాతీయస్థాయిలో కులగణన చేపట్టాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, మహిళలకు చట్టసభల్లో ఆమోదం పొందిన 33 శాతం రిజర్వేషన్‌లో సబ్ కోటా బీసీ మహిళలకు 50శాతం కేటాయించాలని కోరారు.

● **విద్యార్థినికి అభినందన**

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాలలో చదువుతున్న దుపెట లాస్య అనే విద్యార్థిని జాతీయస్థాయి ఇండియన్ నేషనల్ సెర్చ్ ఒలంపియాడ్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చింది. లాస్యను గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అభినందించి బహుమతిని అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, డీన్ విజయ్‌కుమార్, రవీందర్, పీఈటీ బాపురెడ్డి, ఉపాధ్యాయులున్నారు.

● **గిరిజనులకు లాభదాయకంగా ఇందిరాగిరి సోలార్ జల వికాస్**

కోనరావుపేట: గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వ పథకం హర్షణీయమని, ఇందిరాగిరి సోలార్ జల వికాస్ గిరిజనులకు లాభదాయకంగా ఉందని లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర ఇన్‌చార్జి బానోత్ నరేశ్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన గిరిజన సంఘాల నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ పథకంతో రాష్ట్రంలోని పోడుభూముల పట్టాలు అందుకున్న గిరిజన రైతులకు మేలు జరిగేలా ప్రభుత్వం ఇందిరాగిరి సోలార్ జల వికాసం పథకాన్ని పెట్టారన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఇస్లావత్ రాజు నాయక్, అజ్మీరా అమృత్ లాల్, దేశాయ్, అజ్మీరా మదన్ నాయక్, తిరుపతి నాయక్‌లు పాల్గొన్నారు.

● **ట్రాక్టర్లకు చలాన్లు విధించిన మైనింగ్ అధికారులు**

తంగళ్లపల్లి: తంగళ్లపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ యజమానులకు మైనింగ్ అధికారులు చలాన్‌లు విధించారు. మైనింగ్ అధికారుల తనిఖీలతో ట్రాక్టర్ యజమానుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. అప్పటికే అప్రమత్తమైన పలువురు ట్రాక్టర్ డ్రైవర్లు తంగళ్లపల్లికి రాకుండా సిరిసిల్లలోనే ట్రాక్టర్లు నిలిపివేసి.. మైనింగ్ అధికారులు వెళ్లిపోయాక వచ్చినట్లు సమాచారం.

● **పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**

ఎల్లారెడ్డిపేట: సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సాంస్కృతిక సారథి అధ్యక్షుడు గడ్డం శ్రీని వాస్ అన్నారు. మండలకేంద్రంలోని పాత బస్టాండ్‌లో ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై గురువారం కళాకారులు కళాజాత నిర్వహించారు.

● **మండలంలో వర్షం**

వీర్నపల్లి : మండలకేంద్రంతో పాటు పలుగ్రామాల్లో గురువారం వర్షం కురిసింది. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కవర్లు కప్పారు. వెంటనే ధాన్యం తూకం వేయాలని రైతులు కోరుతున్నారు.

రాష్ట్రంలో 42 శాతం పదవులు ఎవరికో..



మాట్లాడుతున్న దాసు సురేశ్

సిరిసిల్లటౌన్: దేశంలో అత్యధికంగా ఉన్న బీసీలు ప్రభుత్వ పథకాలకు పరిమితమైతే భవిష్యత్ అథోగతి పాలవడం తథ్యమని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వస్త్ర వ్యాపార సంఘం భవనంలో సమితి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 42శాతం పదవులు బీసీలకా అగ్రవర్ణాలకా అని ప్రశ్నించారు. గ్రామ స్థాయిలో బీసీల నాయకత్వాన్ని బలోపేతం చేసే దిశగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. జిల్లా కమిటీ నిర్మాణ బాధ్యతలు రాంపల్లి రమేశ్‌కు అప్పగించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వైద్య రాజగోపాల్, బీసీ రాజ్యాధికార సమితి స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గండి వీరేందర్ గౌడ్, పరికిపండ్ల అశోక్, రాష్ట్ర మహిళా సభ్యురాలు జంగోని స్వరూప, ఉత్తర తెలంగాణ ఇన్‌చార్జి బుర్ర కుమార్ గౌడ్, మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటి శ్రీధర్, హన్మకొండ మండల ఇన్‌చార్జి జనార్దన్, సిరిసిల్ల బీసీ నాయకులు గోనె ఎల్లప్ప, సురేశ్, మోర తిరుపతి, కొక్కుల భాస్కర్, గుజ్జతార తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ముస్తాబాద్: అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మి



కోనరావుపేట: బావుసాయిపేటలో ..

ముస్తాబాద్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని పోతుగల్ అంగన్‌వాడీ కేంద్రం–04లో పోషణ్ అభియాన్ పక్షోత్సవాలను గురువారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కోనరావుపేట: తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం కలుగుతుందని, బాలింతలు, గర్భిణులు తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించాలని ఐసీడీఎస్ సూపవర్‌వైజర్ గంగలక్ష్మి అన్నారు. బావుసాయిపేటలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. కార్యదర్శి రాధిక, అంగన్‌వాడీ టీచర్లు మాధవి, కనకలక్ష్మి, వెంకటరమణదేవి, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

రుద్రంగి: ప్రతిఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ మమత అన్నారు. మండల కేంద్రంలోని దెగావత్ తండా పంచాయతీ పరిధిలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



సిరిసిల్లటౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్ యాజమాన్యాలు, సిబ్బందికి పట్టణ ఫైర్ సిబ్బంది అవగాహన కల్పించారు. వేసవిలో అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు. అగ్నిప్రమాద, నివారణ, నియంత్రణ చర్యల గురించి అవగాహన కల్పించారు. వైద్యురాళ్లు శ్రీవాణి, లీలా శిరీష, శోభారాణి, ఎస్‌ఎఫ్ఓ ఎన్. నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

సీనియార్టీ ప్రకారం విధులు కేటాయించాలి

సిరిసిల్ల ఎడ్యుకేషన్: ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షా విధుల్లో ఉపాధ్యాయుల సీనియార్టీని పరిగణలోకి తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పర్కుల రవీందర్, జంగిటి రాజు జిల్లా విద్యాధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. పరీక్ష విధుల్లో సీనియార్టీ నిబంధనను తుంగలో తొక్కి ఇష్టారీతిగా విధులు కేటాయించారని, జూనియర్లకు విధులు కేటాయించి సీనియర్లను పక్కన పెట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా నిబంధనలు పాటిస్తూ కేటాయింపు చేయాలని కోరారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

చందుర్తి: మండలంలోని నర్సింగాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జలేందర్‌రెడ్డి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జితేందర్, ఉపాధ్యాయులు అనిత, కర్ర శ్రీధర్, బానోతు రాజు, సంపతి రమేశ్, ప్రణవి, లాస్య విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

తంగళ్లపల్లి: రాజీవ్ యువవికాసం దరఖాస్తు కోసం మండలప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన జారీచేసిన తహసీల్దార్ జయంత్ కుమార్, ఆర్‌ఐ దినేష్, ఆపరేటర్ రవిని మీసేవా కేంద్రాల నిర్వాహకులు గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మీసేవా నిర్వాహకులు వేముల శ్రీకాంత్, కొత్త సంతోష్, ఎండి.దౌలత్ పాషా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితునికి తప్పిన ప్రాణాపాయం

- మూడు సర్జరీలు.. ఆరుగంటలు
- కోలుకుంటున్న క్షతగాత్రుడు



ఆపరేషన్ తర్వాత వినోద్‌తో వైద్యుడు

ఎల్లారెడ్డిపేట: రోడ్డు ప్రమాదానికి గురై ఆరోగ్యం విషమ పరిస్థితికి చేరిన క్షతగాత్రుడికి ప్రాణాపాయం తప్పింది. మండల కేంద్రంలోని అశ్విని ఆస్పత్రిలోని వైద్యులు ఆరుగంటలు శ్రమించి మూడు ఆపరేషన్లు చేశారు. ప్రస్తుతం క్షతగాత్రుడు కోలుకుంటున్నాడు. వైద్యులు తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలకు చెందిన అంకం వినోద్ హైదరాబాద్‌లోని ఓ ఫార్మ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈనెల 1వ తేదీన ప్రమాదానికి గురయ్యాడు. హైదరాబాద్‌లోని పలు ఆస్పత్రిల్లో చికిత్స పొందిన కోలుకోకపోవడంతో ఎల్లారెడ్డిపేటలో అశ్విని ఆస్పత్రికి తీసుకొచ్చారు. వినోద్ ఎడమ దవడ, ముక్కు, పెల్విస్(కటిభాగం) చిట్లిపోయినట్లు గుర్తించిన వైద్యులు బుధవారం రాత్రి ఆరు గంటలపాటు శ్రమించి ఆపరేషన్‌ను విజయవంతంగా చేశారు. వైద్యుడు జి.సత్యనారాయణస్వామి పర్యవేక్షణలో ఈఎన్‌టీ మోహన్‌కృష్ణ, ఆర్థో సునీల్, ఫేషియల్ నిపుణులు దిలీప్, మత్తు వైద్యులు హేమ్ కుమార్ శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం వినోద్ ఆరోగ్యం నిలకడగా ఉంది. ఆస్పత్రి మేనేజ్‌మెంట్ వైద్యులు జి.సత్యనారాయణస్వామి, అభినయ్ మాట్లాడుతూ ఎలాంటి క్రిటికల్ ఆపరేషన్లు అయినా తమ ఆస్పత్రిలో విజయవంతంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని గీతా విద్యాలయంలో 2007–08లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం మండలంలోని పొత్తూరు శేషాద్రి గార్డెన్‌లో జరిగింది. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. పూర్వవిద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

R.B.V.R.R రెడ్డి సంక్షేమ సంఘం - కరీంనగర్

పత్రికా ప్రకటన

గౌరవ సభ్యులకు నమస్కారం. తేది: 20-04-2025 ఆదివారం రోజున జరగవలసిన సర్వసభ్య సమావేశం కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. తేది: 28-05-2025 బుధవారం రోజున ఉ॥ 10.30 గం॥లకు ఆర్.బి.వి.ఆర్.ఆర్. రెడ్డి కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహించబడును. కావున సభ్యులు అందరూ గమనించగలరు. సం/- బండ గోపాల్ రెడ్డి, కార్యదర్శి,

ఆర్.బి.వి.ఆర్.ఆర్. రెడ్డి సంక్షేమ సంఘం, ఉమ్మడి కరీంనగర్ జిల్లా. సెల్: 99892 11834

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

సిరిసిల్ల జిల్లా: ✆ 9951602934

Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

సిరిసిల్ల : శ్రీకాంత్ - 6281700456
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899